క్లుప్తంగా

సంతాపం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ చెందిన న్యాయవాది నూనె రత్నాకర్ మృతి పట్ల సంతాపం తెలిపారు. రత్నాకర్ ఆత్మకు శాంతి చేకూరాలని 2 నిమిషాల మౌనం పాటించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విప్లవ్ కిరణ్, సీనియర్ న్యాయవాది భూపతి రెడ్డి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్స్ కార్యవర్గం



వేల్పూర్: మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని పడగల్ జేసీపీఏజీ చర్చిలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రెవరెండ్ సియోను కుమార్(పడగల్), ఉపాధ్యక్షుడిగా మాణిక్యం(వేల్పూర్), ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల నోవ(జాన్కంపేట్), సంయుక్త కార్యదర్శిగా సీహెచ్ అశోక్(అంక్సాపూర్), కోశాధికారిగా జెకర్య(వేల్పూర్)లను ఎన్నుకున్నారు.

దొన్కల్‌వాసికి అవార్డు



మోర్తాడ్: దొన్కల్‌కు చెందిన సినీ గేయ రచయిత జిన్న శివకుమార్‌కు యూత్ ఐకాన్–2023 అవార్డును సేవ్ గ్లోబల్ ఫార్మర్స్ అసోసియేషన్, తెలంగాణ కబుర్లు మీడియా ప్రతినిధులు గురువారం అందించారు. చేపూర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన యూత్ ఐకాన్ అవార్డు కార్యక్రమంలో ఎఫ్‌సీఐ డైరెక్టర్ ర్యాడ రవీందర్, రేలారేలా ఫేం గంగా, మైత్రి మహిపాల్‌ల చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. సమాజంలో జరుగుతున్న అనేక అంశాలపై శివ రచనలు చేయడంతో యూత్ ఐకాన్ అవార్డు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



నందిపేట్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన నలిమెల గంగారెడ్డి తన అనుచరవర్గంతో బీజేపీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పట్ల ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన వారు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు.

గోదాదేవి- రంగనాథ స్వామి కల్యాణం

రుద్రూర్: మోస్రా మండల కేంద్రంలోని సీతా రామచంద్ర స్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా గురువారం గోదా దేవి రంగనాథ స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి శ్రీనివాస్ పంతులు మాట్లాడుతూ.. గోదా దేవి కల్యాణ చరిత్రను వివరించారు. 20 ఏళ్ల నుంచి ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. సర్పంచ్ సుమలత పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



బోధన్‌రూరల్(బోధన్): క్రీడలతో విద్యార్థులకు మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందని బోధన్ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా అన్నారు. గురువారం స్వామి వివేకానంద జయంతి, యువజన దినోత్సవం పురస్కరించుకుని పెంటాకలాన్‌లో స్వామి వివేకానంద చిత్ర పటానికి నివాళులర్పించి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

క్రీడా స్ఫూర్తిని పెంచాలి

ఆర్మూర్‌టౌన్: విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంచాలని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. పట్టణంలోని ఎస్సీ, బీసీ వసతి హాస్టల్ విద్యార్థులకు పీడీఎస్‌యూ, పీవోడబ్ల్యూ, పీవైఎల్ అరుణోదయ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్, ఆర్మూర్ ఏరియా పీడీఎస్‌యూ అధ్యక్షుడు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి

బోధన్, బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల పరిధిలో స్వామి వివేకానంద జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వివేకానందుని బాటలో యువత నడుచుకోవాలని ప్రముఖులు సూచించారు. భారత దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడని పలువురు కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



మెండోరా మండల కేంద్రంలో వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీడీసీ సభ్యులు



అడవి మామిడిపల్లిలో..యువజన సంఘం నేతలు



భార్గవి విద్యానికేతన్ పాఠశాలలో ..



ఆర్మూర్ పట్టణంలో.. బీజేపీ, బీజేవైఎం నేతలు



కమ్మర్‌పల్లిలో.. ఎంఈవో ఆంధ్రయ్య, ఉపాధ్యాయులు



ఎడపల్లి: మంగల్‌పాడ్ చౌరస్తాలో..



మెండోరా మండలం పోచంపాడ్‌లో..



గుమ్మిర్యాల్‌లో ..



నవీపేటలో.. బీఆర్ఎస్ నాయకులు



వర్నిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



బాగేపల్లిలో పూలమాల వేస్తున్న సర్పంచ్ సాయిలు



బోధన్‌లోని అంబేద్కర్ చౌరస్తాలోని వివేకానంద విగ్రహం వద్ద .. న్యాయవాదులు



మోస్రా మండల కేంద్రంలో రక్తదాన శిబిరం



కోటగిరి బీజేపీ కార్యాలయంలో..



కల్లూరులో .. గ్రామస్తులు



వివేకానందుడి వేషధారణలో విద్యార్థులు



రుద్రూర్ మండల కేంద్రంలో హోమం



నందిపేటలో ..

సమన్వయంతో ముందుకు సాగుదాం

బోధన్‌రూరల్/బోధన్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపాడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీగా అమలు చేయాలని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో, గ్రామ పంచాయితీల్లో ప్రతి సెంటర్‌లో 150 మంది వచ్చే విధంగా చూడాలన్నారు. హరిత హారం పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో ఎంపీపీ బుద్దె సావిత్రి, ఎంపీడీవో మధుకర్, ఏపీవో వినయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



బోధన్‌లో మాట్లాడుతున్న ఆర్డీవో రాజేశ్వర్

బాల్కొండ: ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మెండోరా ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కంటి వెలుగుపై సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈజీఎస్ ప్రజావేదిక

వేల్పూర్: వేల్పూర్ ఉపాధిహామీ కార్యాలయం వద్ద గురువారం ఈజీఎస్ ప్రజావేదిక నిర్వహించారు. 2019 అక్టోబరు నుంచి 2022 మార్చి వరకు రూ.12 కోట్ల 58 లక్షల విలువ గల పనులకు సంబంధించి ఆడిట్ నిర్వహించారు. గ్రామాల వారిగా ఆడిట్ నివేదికలు ప్రజావేదికలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో చందర్‌నాయక్ మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న ప్లాంటేషన్ పనులు, క్రిమిటోరియంలు, కంపోస్టు షెడ్లు, పల్లె ప్రకృతి వనాలు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీవో చందర్‌నాయక్

కార్యక్రమంలో ఎంపీపీ బీమజమున, జెడ్పీటీసీ అల్లకొండ భారతి, జిల్లా విజిలెన్సు అధికారి నారాయణ, అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, ఎంపీడీవో కమలాకర్‌రావు, ప్రోగ్రాం మేనేజరు ఏకాంబరం, ఎస్‌ఆర్పీ మహేశ్, ఏపీవో అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లతో రైతులు అప్రమత్తంగా ఉండాలి

వర్ని: వరి పంటను ఆశిస్తున్న తెగుళ్లతో రైతులు అప్రమత్తంగా ఉండాలని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ నవీన్ కుమార్ సూచించారు. మండలంలోని పాత వర్ని శివారులో గురువారం వరి పంట పొలాలను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. పంట పొలాల్లో వరిలో ఉల్లికోడు తెగులు గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. తెగులు నివారణకు రైతులు శాస్త్రవేత్తలు సూచించిన సస్యరక్షణ చర్యలను పాటించాలని చెప్పారు. సలహాలు, సూచనలు అందించారు. శాస్త్రవేత్తలు రాజ్ కుమార్, శ్వేత, సురేష్, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న రిలే దీక్షలు

బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 25వ రోజుకు చేరాయి. దీక్షలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.గంగారెడ్డి, న్యాయవాదులు కూర్చున్నారు.

నలంద విద్యార్థుల ప్రతిభ

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి నలంద హైస్కూల్ విద్యార్థులు, ఆర్యభట్ట మెంటల్ ఎబిలిటీ పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ నలంద ప్రసాద్, ప్రిన్సిపల్ నలంద సాగర్ గురువారం తెలిపారు. హైదరబాద్‌కు చెందిన ఈ–అభ్యాస్ అకాడమీ వారు గత డిసెంబరులో ఆర్యభట్ట మెంటల్ ఎబిలిటీ మహోత్సవం నిర్వహించారు. పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 600 పాఠశాలలకు చెందిన 2400 మంది విద్యార్థులు పాల్గొనగా నలంద హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు మొదటి 30 ర్యాంకుల్లో నిలిచారు. విద్యార్థులను యాజమాన్యం అభినందించింది.

శివాజీ విగ్రహాన్ని వెంటనే ఆవిష్కరించాలి

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గల శివాజీ విగ్రహాన్ని వెంటనే ఆవిష్కరించాలని శివసేన జిల్లా అధ్యక్షులు పసులోటి గోపికిషన్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మహాలక్ష్మి మందిరంలో శివసేన పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు మాట్లాడారు. శివాజీ విగ్రహ ఆవిష్కరణ ప్రజల కోరికని, ఈ విగ్రహ ఆవిష్కరణకు హిందూ సంఘాలు, హనుమాన్ దీక్షాపరులు, ఇతర దీక్షా పరులు, గ్రామ పెద్దలు సహకరించాలన్నారు. శివసేన నాయకులు గొంతగౌడ్, ఆకుల రాజు, నందకిశోర్, ప్రీతం గౌడ్, విజయ్‌బాబు ఉన్నారు.

నియామకం

నందిపేట్(ఆర్మూర్): ఆర్మూర్ నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్షుడిగా నందిపేట మండలం వెల్మల్ గ్రామానికి చెందిన కేజీ సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నందిపేటలో జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. కురుమ సంఘ సభ్యుల అభ్యున్నతి కోసం పాటుపడుతానని నూతన అధ్యక్షులు కేజీ సురేష్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి తొండకూర్ దేవన్న, కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటు వివాదాస్పదం

- మోర్తాడ్‌లో గౌడ, మున్నూరుకాపు సంఘాల మధ్య చిచ్చు
- వివాదానికి కారణమైన చోట పోలీసు పికెట్ ఏర్పాటు

మోర్తాడ్: మోర్తాడ్ గ్రంథాలయ పరిసరాల్లో ఇది వరకు ఉన్న గాంధీ విగ్రహం స్థానంలో కొత్త విగ్రహంతో పాటు సర్దార్ పాపన్న విగ్రహం ఆవిష్కరించడానికి స్థానిక గౌడ సంఘం ఏర్పాటు చేయడం, దీనిపై మున్నూరుకాపు సంఘం సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదాస్పదంగా మారింది. గతంలో గాంధీ విగ్రహం ఒక్కటే ఉండేదని, అందువల్ల కొత్త గాంధీ విగ్రహానికి ఎలాంటి అభ్యంతరం లేదని మున్నూరుకాపు సంఘం సభ్యులు చెబుతున్నారు. గాంధీ విగ్రహాన్ని తమ సంఘమే ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతలను చూస్తుందని, ఇక్కడ ఉన్న ఖాళీ స్థలంలో సర్దార్ పాపన్న విగ్రహం ఏర్పాటు చేస్తే ఎందుకు అభ్యంతరం అని గౌడ సంఘం సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఒక వేళ సర్దార్ పాపన్న విగ్రహం ఆవిష్కరిస్తే అక్కడే శివాజీ విగ్రహాన్ని తాము ఏర్పాటు చేస్తామని మున్నూరుకాపు సంఘం సభ్యులు స్పష్టం చేశారు. వివాదం ముదరకుండా ఉండటానికి పోలీసు పికెటింగ్‌ను ఏర్పాటు చేశారు.

కమ్మరి కొలిమి తొలగించడంతో..

వ్యవసాయ పరికరాలకు సానబట్టే కమ్మరి కొలిమిని ఈ విగ్రహాల స్థలం వద్ద అనేక సంవత్సరాల పాటు నిర్వహించారు. కొలిమి తొలగించేలా చేయడం, విగ్రహాల స్థలం సువిశాలంగా ఉండటంతో గౌడ సంఘం సభ్యులు పాత విగ్రహం తొలగించి రెండు కొత్త విగ్రహాలను ఏర్పాటు చేయడానికి దిమ్మెలను నిర్మించి విగ్రహాలను నిలబెట్టారు. కొత్త విగ్రహాలు ఏవి ఏర్పాటు చేయాలన్నా మార్కెట్ స్థలంలోనే ఏర్పాటు చేయాలని వీడీసీ గతంలో తీర్మానించిందని మున్నూరుకాపు సంఘం సభ్యులు చెబుతున్నారు. సమస్య ఎలా పరిష్కారం అవుతుందోనని అందరూ ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.



మోర్తాడ్‌లో ఏర్పాటు చేసిన విగ్రహాలు

దిమ్మెను కూల్చడం సరికాదు

బోధన్: మోర్తాడ్ మండల కేంద్రంలో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం నిర్మించిన దిమ్మెను కొందరు కూల్చి వేయడం సరికాదని మోకు దెబ్బ సంక్షేమ సంఘం నేతలు నాగుల రవిశంకర్ గౌడ్, గౌడ సంఘం నేతలు అశోక్‌గౌడ్, విఠల్ గౌడ్‌లు అన్నారు. గురువారం పట్టణంలో వారు మాట్లాడారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల పరిధిలోని పలు పాఠశాలల్లో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంక్రాంతి పండగ విశిష్టతను గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థులు గాలి పటాలను ఎగురవేసి వేడుకలు జరుపుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



లోటస్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు.. పాల్గొన్న చిన్నారులు



బుస్సాపూర్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు



రెంజల్ ఆదర్శ పాఠశాలలో ..



హరిదాసుల వేషంలో చిన్నారులు



జెంటిల్ కిడ్ పాఠశాలలో గాలిపటాలతో చిన్నారులు

ఆయిల్ పాం సాగుతో లాభాలు

బాల్కొండ: ఆయిల్ పాం పంట సాగుతో అనేక లాభాలు ఉన్నాయని భీంగల్ ఏడీఏ మల్లయ్య అన్నారు. గురువారం వన్నెల్(బి)లో ఆయిల్ పాం పంటపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఉప సర్పంచ్ కిషన్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

మాక్లూర్: కొత్తపల్లి శివారులో రైతు గుంటి పోశమల్లు రెండు ఎకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్ పాం క్షేత్రాన్ని గురువారం మండల వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగుపై రైతులకు తగు సూచనలు, సలహాలు అందించారు. సర్పంచ్ వేములపల్లి సుబ్బారావు, ఏఈవో రాజహంస పాల్గొన్నారు.



వన్నెల్(బి)లో పంటను పరిశీలిస్తున్న అధికారులు

సమాచారం..

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరాలనుకునే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ గాయత్రి తెలిపారు. టీజీయూజీ సెట్–2023 సంవత్సరానికి అడ్మిషన్లకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని, ఇంటర్ పూర్తిచేసిన, ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారు టీజీయూజీ సెట్ రాయడానికి అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 5లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మార్చి 5న పరీక్ష ఉంటుందన్నారు.

18 నుంచి ఉచిత కంటి పరీక్షలు

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 18 నుంచి ప్రారంభం చేస్తున్న రెండో విడత కంటి పరీక్షలను పుర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్ కోరారు. పట్టణంలోని అన్ని వార్డులలో ఈ కార్యక్రమం 100 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. 18 ఏళ్ల పైబడిన వారికి ఈ క్యాంపులో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైతే కంటి అద్దాలు, ఉచితంగా మందులు సైతం ఇస్తామని తెలిపారు.

నేడు నవీపేట, రుద్రూర్‌లలో..

నవీపేట/రుద్రూర్: ఈ నెల 18 నుంచి నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలకు మండల కేంద్రాల్లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు నవీపేట, రుద్రూర్ ఎంపీడీవోలు సాజిద్ అలీ, ఎంపీడీవో బాలగంగాధర్ గురువారం పేర్కొన్నారు. సకాలంలో హాజరుకావాలని కోరారు.